క్లుప్తంగా

నేడు గంగ జాతర

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని నల్లపురెడ్డిపల్లి, నారాయణ నెల్లూరు గ్రామాలలో నేడు గురువారం గంగ జాతర నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ జాతరకు బంధుమిత్రులు అత్యధికంగా గ్రామాలకు రావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

నామమాత్రంగా మండల మీట్

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎలక్షన్ కోడ్ కారణంతో మండల సర్వసభ్య సమావేశం పోలీసుల సమక్షంలో నామమాత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామచంద్రయ్య ఆఫీస్ రూమ్‌లో సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు సమక్షంలో ఎన్నికల కోడ్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోర్ సభ్యులతో రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకుని నామమాత్రంగా సమావేశాన్ని ముగించారు.

శ్రీనివాసపురంలో కార్డెన్ సెర్చ్



కేంద్ర బలగాలతో తనిఖీలు చేయిస్తున్న పోలీసులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ శ్రీనివాసపురంలో బుధవారం కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని కేంద్ర బలగాల సహాయంతో నిర్వహించినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రతి చోట్ల వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్నందున ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఎస్ఐ చెప్పారు. అనంతరం గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలను వారు అందజేశారు.

మండలానికి చేరిన విద్యార్థుల బెల్టులు



సంబేపల్లెకు చేరిన విద్యార్థుల బెల్టులు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు బెల్టులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలో మండలంలోని విద్యార్థులకు సంబంధించి 2860 బెల్టులను మంగళవారం ఎంఈఓ కార్యాలయానికి చేరాయి. వీటితోపాటు విద్యాసామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ



వైద్యులకు సూచనలు చేస్తున్న వేణుగోపాల్

సుండుపల్లె : మండల కేంద్రంలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వలన మలేరియా, డెంగీ, బోధ కాలు వచ్చే అవకాశం ఉందని, కావున ఇంటి పరిసరాలలో పరిశుభ్రత పాటించి దోమ తెరలు వాడాలని ప్రజలకు సూచించాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, ఇంతకు ముందు టీబీ మందులు వాడినవారు ఇప్పుడు టీబీ మందులు వాడుతున్న వారు బీసీజీ టీకాను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేఖర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, జయరామయ్య, ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సూపర్‌వైజర్ ఎల్లమ్మలు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయల పంపిణీ



వేరుశనగ విత్తనాలు నిల్వ ఉంచుతున్న దృశ్యం

సుండుపల్లె : మండల కేంద్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో 40శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. మండలానికి 950 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని, 40 శాతం సబ్సిడీ పోను నారాయణి రకం ఒక క్వింటాల్ ధర రూ. 582లు రైతులు చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మహబూబ్ బాషా తెలిపారు. ఇప్పటి వరకు అన్ని రైతు భరోసా కేంద్రాలలో 917 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతు వారి రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తనకాయలు తీసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా నల్లగంగమ్మ క్షేత్రం



నల్లగంగమ్మ ఆలయంలో సాధుపుంగవుల బృందం



అమ్మవారికి పూజలు చేస్తున్న హరిద్వార పీఠాధిపతి

ఆలయ సందర్శనలో హరిద్వార్‌కు చెందిన పీఠాధిపతి, సాధు పుంగవుల బృందం

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతుందని ఉత్తర ప్రదేశ్‌లోని హరిద్వార్‌కు చెందిన పీఠాధిపతి శ్రీ పరమహంస్ బాబా బన్‌ఖండీ మహరాజ్, సాధు పుంగవుల బృందం పేర్కొన్నారు. మంగళవారం రాత్రి సాధు పుంగవులు మండలంలోని నల్లగంగమ్మ సన్నిధికి చేరుకున్నారు. బుధవారం ఉదయం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించారు. అమ్మవారి భక్తులు ఆలయ విశిష్టతను, దేవరరాయి మహాత్యాన్ని సాధుపుంగవులకు వివరించి, ఫల పుష్పములు సమర్పించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. నల్లగంగమ్మ ఆలయం దినదినాభివృద్ధి చెందడం హర్షణీయమన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు ప్రశాంతతకు నిలయాలుగా ఉన్నాయని, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కృషితో రూ.1.20 కోట్ల నిధులతో ఆలయ విస్తరణ పనులు ముగింపు దశకు చేరుకుంటుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మురళీ స్వామి, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, గంగిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, తేజ స్కూల్ కరస్పాండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, డీలర్ సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'టిష్యూకల్చర్' అందుబాటులోకి తెచ్చేందుకు కృషి

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు నియోజకవర్గ రైతులకు టిష్యూకల్చర్ మొక్కలను అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల ప్రధాన శాస్త్రవేత్త కేటీ వెంకటరమణ పేర్కొన్నారు. వైకోట గ్రామంలో బుధవారం సాయంత్రం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల, అనంతరాజుపేట జేసీ దివాకర్ రెడ్డి ఉద్యాన కళాశాల తాడిపత్రి వారి ఆధ్వర్యంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు మూడు నెలలపాటు గ్రామీణ ప్రాంతాలలో ఉద్యాన పంటలను పరిశీలించి వాటిపై పరిశోధన నిర్వహించి అనేక సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలను తెలుసుకున్నారన్నారు. రైతులు ఉద్యాన పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, సకాలంలో మొక్కల కత్తిరింపు, ఎరువులను వినియోగించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. అనంతరం వివిధ రకాల ఉద్యాన పంటల సాగు తదితర అంశాలు గురించి రైతులకు వివరించారు. అనంతరం మామిడి, బొప్పాయి పంటలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్ నాయక్, డాక్టర్ శరత్ చంద్రారెడ్డి, ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ మహమ్మద్ షఫీ, విద్యార్థులు, రైతులు వెంకటరమణ, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతు సదస్సులో మామిడి రకాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

ఫలితాల రోజు టపాసులు కాల్చరాదు



ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ రమాకాంత్

సిద్దవటం : ఎన్నికల ఫలితాల రోజున గ్రామాల్లో ఎవరైనా గొడవలు సృష్టిస్తే వారిపై కఠినమైన చర్యలు తప్పవని ఎన్నికల నోడల్ అధికారి డీఎస్పీ రమాకాంత్ హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని టక్కోలి పంచాయతీలోని డేగనవాండ్లపల్లె, మాచుపల్లె గ్రామాల్లో బుధవారం ఎన్నికల నోడల్ అధికారి, డీఎస్పీ రమాకాంత్ పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. ఘర్షణలకు, కక్షపూరిత రాజకీయాలు, వర్గ పోరు, టపాసులు కాల్చడం వంటి కార్యక్రమాలకు పాల్పడితే ఎటువంటి వారినైనా వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కారిస్తామన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పోలీసులకు గ్రామస్తులు సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసు సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

'రెండోసారి సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణం'



గంగమ్మకు పూజలు చేస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మాజీ ఎంపీపీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లె : ఈ ఏడాది మంచి వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు అందరూ చల్లంగా ఉండేలా కరుణించి కాపాడవమ్మా గంగమ్మా అంటూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అమ్మవారిని కోరుకున్నారు. బుధవారం మండలంలోని కోనంపేట గ్రామం, కొండావాండ్లపల్లె సమీపంలో వెలసిన గంగమ్మకు ఆయన స్థానిక నాయకులతో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి ఆయన మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులతో ఇప్పటికే రెండు పర్యాయాలు పదునుపాటి వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్‌కు రైతులు దుక్కులు దున్నుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులను ఆదుకోవాలని ప్రార్థించారు. ఇప్పటికే ఆర్బీకేలలో విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. కొద్దిరోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. వరుణ దేవుడు కూడా కరుణించడం మనకు శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండా ప్రసాద్ రెడ్డి, కొండా నాగముని రెడ్డి, అలీ బాషా, సూర్యనారాయణ రెడ్డి, యూత్ నాయకులు కాలాడి వినయ్‌కుమార్‌రెడ్డి, రామాపురం ఏపీఓ మద్దిరేవుల సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ సిద్దక నాగిరెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, శంకర్ నాయుడు, ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శివమల్ రెడ్డి, నాగమణి రెడ్డి, పకీర్ రెడ్డి, బంద్రెడ్డి, శంకర్ రెడ్డి, తోపురెడ్డి గోపాల్‌రెడ్డి, మల్ రెడ్డి, నాగేంద్ర బాబు, లక్ష్మీరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి పరామర్శ

లక్కిరెడ్డిపల్లె మండలం బి.ఎర్రగుడి గ్రామం కాపువపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చిన్న రెడ్డప్పరెడ్డిని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు పరామర్శించారు. చిన్నరెడ్డప్పరెడ్డికి ఇటీవల జరిగిన చిన్నపాటి ప్రమాదంలో రెండు కాళ్లకు గాయాలై చికిత్స పొంది విశ్రాంతి పొందుతున్నారు. బుధవారం కాపువపల్లెలోని ఆయన నివాసంలో చిన్న రెడ్డప్పరెడ్డిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని త్వరితగతిన ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు.

మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డికి పరామర్శ

రాయచోటి (అన్నమయ్య సర్కిల్) : రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. పోలు సుబ్బారెడ్డికి ఇటీవల కాలుకు గాయమై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. బుధవారం యండపల్లె గ్రామం బోయపల్లెలోని సుబ్బారెడ్డి నివాసంలో ఆయన్ను ఎమ్మెల్యే కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఆరోగ్యవంతుడవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు బసిరెడ్డి సిద్దారెడ్డి, నాయకులు రాజారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మల్‌రెడ్డి, యర్ర బయన్న, నాగార్జునరెడ్డి, నల్లబయన్న తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



జాతరలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి

రాయచోటి టౌన్ : అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాత్రి రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామం మురికివాండ్లపల్లెలో మూలగంగమ్మ జాతర నిర్వహించారు. ఈ జాతరను పర్యవేక్షించేందుకు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి చాందినీ బండ్లు తిరిగే సమయంలో సమీపంలోని దారిలో చెత్తకు నిప్పు రగులుకోవడంతో పెద్ద పెద్ద మంటలు రేగాయి. అక్కడే ఉన్న ఎస్ఐ భక్తవత్సలం స్థానికుల సహాయంతో మంటలు అదుపులోకి తెచ్చారు. ఈ క్రమంలో ఫైర్ స్టేషన్ అధికారులకు కూడా సమాచారం అందించారు. అలాగే రాత్రి జాతరతోపాటు ఆ గ్రామ పరిధిలోని పలు గ్రామాలలో సీఐ పర్యటించి ప్రజలకు తగు సూచనలు చేశారు. ఎన్నికల వేల ఎవరైనా అసాంఘిక చర్యలు పాల్పడితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకొంటామన్నారు. శాంతి భద్రతల విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

ఎల్లమ్మ జాతరను జరపవద్దు

గ్రామస్తులకు రాయచోటి రూరల్ సీఐ సూచన



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ తులసీరాం

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల కస్బాలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ జాతరను జరపవద్దని రూరల్ సీఐ తులసీరాం గ్రామస్తులకు సూచించారు. బుధవారం సాయంకాలం ఆ గ్రామంలో ఉండే ముస్లింలు, హిందువులతోపాటు పలువురు గ్రామ నాయకులలో వీరబల్లెలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువల్ల, అలాగే కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో జాతర నిర్వహణ వల్ల పలు సమస్యలు ఏర్పడ వచ్చన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యాక జాతరను జరుపుకోవాలని సూచించారు. కానీ హిందువులు, ముస్లింలు, గ్రామ నాయకులు సామరస్యంగా ఎల్లమ్మ జాతరను జరుపుకుంటామని, నేటి నుంచి ఆదివారం వరకు జరగాల్సిన జాతర కార్యక్రమాలను ఏర్పాటు చేసుకున్నామని సీఐకు విజ్ఞప్తి చేశారు. ఎట్టి పరిస్థితుల్లో జాతర జరిపేందుకు వీలు కాదని సీఐ తేల్చి చెప్పడంతో గ్రామస్తులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో క్రాప్ లోన్లు చెల్లించండి

రామాపురం : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందాలని మేనేజర్ కె.మంజుల అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే క్రాప్ లోన్ రెన్యువల్స్ యథావిధిగా జరుగుతున్నాయని లబ్ధిదారులు తాను తీసుకున్న పంట రుణాల తేదీని గుర్తుపెట్టుకుని సంవత్సరం తేదీకి ఒక రోజు ముందుగా వడ్డీ చెల్లించాల్సి వస్తుందని ఆమె తెలిపారు. గ్రామాల్లోని ఖాతాదారులు ఆయా గ్రామాలకు సంబంధించిన బిజినెస్ కరస్పాండెంట్ ద్వారా విషయం తెలుసుకుని సకాలంలో చెల్లించాలని ఆమె తెలిపారు.

ఖాతాదారులకు ఒక వరం బీమా పథకాలు

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ కాతాదారులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకాలు ఒక వరం లాంటివని రామాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె.మంజుల అన్నారు. బ్యాంకులో అకౌంట్ కలిగిన ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద సంవత్సరానికి రూ.20 ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన కింద రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల వరకు బీమా పొందవచ్చని ఆమె తెలిపారు. ఖాతాదారులు తమ ఖాతాలో కనీస నిలువలను ఉంచుకోవాలని ఆమె తెలిపారు.

బీసీజీ టీకాతోనే టీబీ నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కమల్

నందలూరు : బీసీజీ టీకాతోనే టీబీ వ్యాధిని నివారించవచ్చని మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కె శరత్, కమల్, డాక్టర్ విశ్వనాథులు తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సులోపు వారికి, ఐదు సంవత్సరాల కిందట టీబీ వ్యాధి వచ్చి తగ్గిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ త్రాగుతూ చాలించిన వారికి, ఇప్పుడు పొగ తాగేవారికి, టీబీ వ్యాధిగ్రస్తులతో ఎక్కువ సంబంధాలు ఉన్నవారికి, బాడీ మ్యాక్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారికి, టీబీ వ్యాధి ఎక్కువగా వస్తుందని గుర్తించి వారికి బీసీజీ టీకాలు వేసి వ్యాధిని నివారించాలని సూచించారు. నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రతి గురువారం బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బీసీజీ టీకా గురించి మీకు దగ్గరలోని ఉప కేంద్రంలో ఆశ కార్యకర్తలను, ఆరోగ్య కార్యకర్తలను, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించాలని కోరారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న అబ్దుల్లా

నందలూరు : నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో క్రేజీ లెవన్స్ నందలూరు జట్టుపై వినాయక లెవన్స్ నాగిరెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వినాయక జట్టు 14 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. వినాయక జట్టు ఆటగాడు అబ్దుల్లా 9 సిక్సర్లు, 4 ఫోర్‌లతో 46 బంతుల్లో 91 పరుగులు చేశాడు. అనంతరం బరిలో దిగిన నందలూరు జట్టు 14 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 142 పరుగులు చేసి పరాజయం చెందింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన అబ్దుల్లాకు సీనియర్ క్రికెటర్లు పత్తి శంకర్, కిరణ్‌లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందించారు.

పాటూరుపై మునక్కాయలపల్లి విజయం..

మధ్యాహ్నం పాటూరు, మునక్కాయలపల్లి జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన మునక్కాయలపల్లి జట్టు 14 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. హరి 43, కార్తీక్ 38, ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ 31 పరుగులు చేశారు. అనంతరం 165 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన పాటూరు జట్టు 14 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ రాణించిన కార్తీక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందజేశారు. ఈ మ్యాచ్‌కు శివకోటి, మున్నాలు అంపైర్లుగా, అఫ్సర్, దినేష్‌లు స్కోరర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆటలతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె : విద్యార్థులు, యువతకు ఆటలతోనే మానసిక ప్రశాంతత, దేహధారుడ్యం చేకూరుతుందని మదనపల్లె హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీఐ ఎదురుగా మైదానంలో మినీవాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు మెమొంటో, మెడల్స్ అందజేశారు. యువత క్రీడానైపుణ్యం కోసం సమ్మర్‌క్యాంపు నిర్వహిస్తున్న కోచ్ యూసఫ్‌ను అభినందించారు. సీనియర్ క్రీడాకారులు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు శివ,కిరణ్, పురుషోత్తం రెడ్డి, సిరాజ్, బషీర్, దివాకర్‌లు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి



వంటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న అధికారులు

సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి, స్టేట్ కో-ఆర్డినేటర్ ఎం.రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ ఎస్టీ సుండుపల్లెలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందించే మెనూను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. పాఠశాల యాజమాన్యాలతో వంట ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వంట ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకొని విద్యార్థులకు అందించే భోజనం, కూరలు రుచి, శుభ్రతతోపాటు నాణ్యతగా వండి పిల్లలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. తదనంతరం వంట ఏజెన్సీ వారికి వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బి.కళావతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

కలకడ : దివాగుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, తల్లిదండ్రులు దివ్యాగులను ప్రోత్సహించి ప్రత్యేక పాఠశాలలో నమోదు చేసుకోవాలని మండలవిద్యాశాఖ అధికారి రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కలకడ, కె.బాటవారిపల్లె పంచాయతీలలోని ప్రతి ఇంటిని సందర్శించి 20 మంది చిన్నారులను గుర్తించి వారి పేర్లను నమోదు చేసుకున్నారు. అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బి.కొత్తకోటకు చేరిన రోడ్డు వివాదం

- గోడ కూల్చారని గ్రామస్తులపై ఫిర్యాదు
- రెవెన్యూ సిబ్బందికి గ్రామస్తుల వినతి



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న కొత్తపల్లె గ్రామస్తులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ కొత్తపల్లెకు వెళ్లే మట్టిదారిని ఆక్రమించి సిమెంటు పలకలతో గోడను నిర్మించి రాకపోకలకు అడ్డు కల్పించారని గ్రామస్తులు మంగళవారం రాత్రి ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఈ వ్యవహారం బి.కొత్తకోటకు చేరింది. కొత్తపల్లె గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్ చేరుకుని రహదారి సమస్యపై సీఐ సూర్యనారాయణకు నివేదించారు. తరతరాలుగా ఉన్న రహదారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించడం వల్ల ఇబ్బందులు పడతామని గ్రామస్తులు సీఐకి వివరించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ గ్రామస్తులకు సూచించడంతో వారు తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. తహసీల్దార్ ఎన్నికల విధుల్లో ఉండటంతో గ్రామస్తులు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. రహదారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించారని, దీన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రెవెన్యూ సిబ్బంది చెప్పారు. కాగా మంగళవారం రాత్రి కొత్తపల్లెలో జరిగిన ఘటనపై నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ స్థలంలో సిమెంటు పలకలతో ప్రహరీ ఏర్పాటు చేసుకుంటే గ్రామస్తులు వాటిని తొలగించారని పేర్కొంటూ ఫిర్యాదు చేసింది.

తెట్టు ఆలయ హుండీ ఆదాయం రూ.1.14 లక్షలు

కురబలకోట : మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 1,14,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మునిరాజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. డిసెంబరు 23 నుంచి మే 24 వరకు హుండీ ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ ఆంజనేయులునాయుడు

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఒక్క రోజు శిక్షణను నిర్వహించినట్లు ఎంఈఓ ఆంజనేయులునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన తయారీలో పాటించాల్సిన శుచి, శుభ్రత, భోజన తయారీలో మెళకువలను తెలియజేశారు. మధ్యాహ్న భోజనాన్ని శుభ్రత పాటిస్తూ రుచికరంగా మెనూ ప్రకారం తయారు చేసి విద్యార్థులకు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ హైస్కూల్ హెచ్‌ఎం పద్మజ, శిక్షణకు రీసోర్స్ పర్సన్ నాగేశ్వరమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ములకలచెరువు : మండలంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలించినా, డంప్ చేసినా చర్యలు తప్పవని ఎస్ఈబీ సీఐ రామమోహన్, ఎంపీడీఓ పోలప్ప, ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లె సమీపంలోని పెద్దేరు వంక నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు, చుట్టు పక్కల ఇసుక డంప్‌లు ఏర్పాటు చేశారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మదనపల్లె మైనింగ్ సిబ్బందితో అధికారులు బుధవారం దేవులచెరువుకు చేరుకున్నారు. వంకకు చుట్టుపక్కల డంప్ చేసిన సుమారు 100 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో తదతరి చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.